

సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

ఖాజాబాగ్ బస్తీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

● ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

సైదాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గిరిజనులు, పేదలు నివసించే ఖాజాబాగ్ బస్తీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి తెలిపారు. శుక్రవారం ఖాజాబాగ్ బస్తీలో రూ.49.15లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. రాజకీయాలకతీతంగా డివిజన్‌లో అన్ని బస్తీలు, కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్ రెడ్డి, నేతలు రవితేజా, శివ, నర్సింహ, వంశీ, మాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణల ప్రాంతంలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

ఆక్రమణలు తొలగించండి: కార్పొరేటర్ అరుణ

సైదాబాద్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ కాలేజీ వెళ్లే దారిలో ఆక్రమణ చెర నుంచి వెంటనే రోడ్ల స్థలాలను రక్షించాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి అన్నారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆమె ఆక్రమణలు పరిశీలించారు. ఇష్టారాజ్యంగా ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలు తొలగించాలన్నారు. కార్యక్రమంలో మలకపేట సర్కిల్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ అలీ, మెడికల్ ఆఫీసర్ రుద్ర శ్రీనివాస్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో కలిసి సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

శ్రీపురం కాలనీలో సీసీ రోడ్డు పనులు

చాదర్‌ఘాట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్ శ్రీపురం కాలనీలో అధ్వానంగా తయారైన బీటీ రోడ్డును పూర్తిగా తొలగించి ఈ స్థానంలో నూతన సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కాలనీవాసులతో కలిసి ఆమె ప్రారంభించారు. రూ.12లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వర్షం కురిసినప్పుడు వరద నీరు రోడ్డుపై నిల్వ కుండా ఉండేలా నూతన సీసీ రోడ్డును నిర్మించాలని జీహెచ్‌ఎంసీ సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డిలకు సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు కనుకుల రవీందర్‌రెడ్డి, దత్తు, పరశురాం, హరినాయక్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్ కుమార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, ఫార్మసీ విద్యార్థులు

అనాజ్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా అవంతి ఫార్మసీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌లో నిర్వహించిన శిబిరంలో బీపీ, షుగర్, రక్త, సాధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ఫార్మసీ విద్యార్థులు ఇప్పటి నుంచే వైద్య సేవలు అందించడం గొప్ప విషయమని అన్నారు. 150 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు ప్రోగాం కో-ఆర్డినేటర్ తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కమల్, పీఆర్వో శ్రీనివాస్, హెచ్‌ఓడీ రామకృష్ణ, మంజులతో పాటు పలువురు పాల్గొన్నారు.



మట్టితో పూడ్చిన కార్ఖానాకుంట ప్రాంతం

కార్ఖానాకుంట చివరి భాగం మట్టితో పూడ్చివేత

● పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): కబ్జాదారులు గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రే పెద్దఅంబర్‌పేట్ కార్ఖానాకుంట చివరి భాగాన్ని మట్టితో పూడ్చివేస్తున్నారు. ప్రజయ్ గుల్మోర్ గేటెడ్ కమ్యూనిటీ వెనుకవైపు ఈ తతంగం జరుగుతోంది. ఈ విషయాన్ని గమనించిన కమ్యూనిటీ వాసులు శుక్రవారం ఇరిగేషన్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ ఏఈ స్టాలిన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో దీన్ని పరిశీలించారు. మట్టి నింపిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వందేమాతరం.. ప్రతీ భారతీయుడి గుండె చప్పుడు

సరూర్‌నగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతం ప్రతి భారతీయుడి గుండె చప్పుడని, అది లక్షలాది మందిని ఏకం చేసిన మహత్తర గీతమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. 150 వసంతాల వందేమాతరం వేడుకల్లో భాగంగా శుక్రవారం జిల్లెలగూడ గాయత్రీనగర్ చౌరస్తాలోని నాగార్జున స్కూల్‌లో బీజేపీ మీర్‌పేట్ కార్పొరేషన్ క్లస్టర్-2 అధ్యక్షుడు తులసి ముఖేశ్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శులు సిద్దాల శ్రీనివాస్, కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. విద్యార్థినీ విద్యార్థులతో కలిసి పార్టీ నాయకులు వందేమాతరం గీతం ఆలపించారు. అనంతరం భగవద్గీత పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కె.సోమేశ్వర్, మద్ది రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేషన్ నాయకులు గాజుల మధు, కాశీరాంయాదవ్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలి స్వర్గం రోజున పరేషాన్

జిల్లెలగూడ బాలాజీ టెంపుల్‌లో సినిమా షూటింగ్

- దర్శనం, అభిషేకం చేయకుండానే వెనుదిరిగిన భక్తులు
- అతి కష్టం మీద పలువురు ప్రదక్షిణలు
- ఆ సిబ్బంది స్నానం ఆచరించ లేదని ఆరోపణ
- చెప్పులు వేసుకుని ఆలయంలో సంచారం
- భక్తజనం ఆగ్రహం





స్వామిని దర్శించుకునేందుకు ఇబ్బందులు పడుతున్న భక్తులు

సరూర్‌నగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి రోజును పోలి స్వర్గంగా పేర్కొంటారు. మహిళా భక్తులు ఆలయాల్లో పూజలు చేసి కొలనుల్లో కార్తీక దీపాలు వదులుతుంటారు. శుక్రవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గల స్వయంభూ మత్స్యావతార వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చేరుకోగా సినిమా షూటింగ్ సందడి చూసి భక్తులు వాపోయారు. ప్రతీ శుక్రవారం బాలాజీకి ప్రత్యేకంగా అభిషేకం నిర్వహిస్తుంటారు. ఈ శుక్రవారం అర్చకులు పఠించిన మంత్రాలు, శ్లోకాలు భక్తులకు వినిపించని పరిస్థితి. షూటింగ్ సిబ్బంది .. ఈలలు, అరుపులు, కేరింతలు మాత్రం వినిపించాయి.

● శుక్రవారం జిల్లెలగూడ బాలాజీ కోవెలలో ఆధ్యాత్మిక వాతావరణం పూర్తిగా దెబ్బ తింది. ఆలయ అధికారులు.. పోలి స్వర్గం రోజు సినిమా షూటింగ్‌కు అనుమతి ఇవ్వడంతో భారీ ఎక్స్‌కవేటర్‌తో, కెమెరా స్టాండ్లతో, భారీ లైట్ల, నటీనటులతో, షూటింగ్ సిబ్బందితో రద్దీగా కనిపించింది. మెయిన్ గేట్ నుంచి మొదలుకొని ఆలయం ప్రధాన ద్వారం వరకు షూటింగ్ వాహనాలు నిలిపారు. ఇక ఆలయం మెట్ల మీద, ఆలయం లోపల గర్భగుడి చుట్టూ షూటింగ్ సిబ్బంది నిండిపోయారు. ఇక్కడి వేణుగోపాల్‌స్వామి ఉపాలయంతో పాటు ఇతర ఆలయాల్లోనూ భక్తులు దర్శనం చేసుకునే వీలు లేకుండా పోయింది. గుడి చుట్టూ ప్రదక్షిణలకు అవకాశం లేకుండా షూటింగ్ సిబ్బంది తమ సామగ్రితో నింపారు. కొందరు భక్తులు అతి కష్టం మీద ప్రదక్షిణలు చేయగా.. అనేక మంది నిరాశతో వెనుదిరిగిపోయారు. ఆలయ అధికారులు తీసుకున్న నిర్ణయంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆలయ ఈవో శ్రీనివాస్‌రెడ్డి వివరణ కోసం ప్రయత్నించగా ఆయన ఫోన్ ఎత్తలేదు. ఇండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా.. షూటింగ్ విషయం తన దృష్టికి రాలేదన్న ఆయన.. పూర్తి వివరాలు తెలుసుకుంటానని పేర్కొన్నారు.

అపవిత్రం చేశారు

షూటింగ్ ఉదయాన్నే ఉండగా సిబ్బందిలో అధిక శాతం స్నానం చేయకుండానే ముందు రోజు ధరించిన దుస్తులతోనే ఆలయంలోకి వచ్చారు. కొందరు సిబ్బంది చెప్పులు వేసుకుని ప్రధాన ద్వారం మెట్లు ఎక్కారు. ఆలయ ప్రాకారాలపైకి ఎక్కి లైట్లు ఏర్పాటు చేసుకున్నారు. పవిత్రమైన పోలిస్వర్గం రోజు ఆలయాన్ని పూర్తిగా అపవిత్రం చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. దీనికి బాధ్యులైన ఆలయ అధికారులపై చర్యలు తీసుకోవాలి.

- ఎం.రవికుమార్, భక్తుడు, మీర్‌పేట్

మరోసారి జరగకుండా చూస్తాం

ఏ ఆలయంలోనైనా షూటింగ్‌లకు అనుమతిచ్చే అధికారం ఆయా ఆలయాల ఈవోలదే. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా, ముఖ్యమైన రోజుల్లో కాకుండా సాధారణ రోజుల్లో అనుమతి ఇవ్వాలి. కార్తీక మాసంలోని పోలి స్వర్గం రోజు.. పైగా శుక్రవారం అభిషేకం రోజు ఎలా అనుమతిచ్చారో ఈవోతో మాట్లాడాలి. ఇకపై ఇలా జరగకుండా చూస్తాం.

- ప్రణీత్‌కుమార్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్



ప్రదక్షిణలు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న భక్తులు



ఆలయ ప్రధాన మెట్లపై చెప్పులతో తిరుగుతున్న షూటింగ్ సిబ్బంది

గ్రంథాలయాల్లో మధ్యాహ్న భోజనం

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్
- యేటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కూడా



బడంగ్‌పేట్ గ్రంథాలయంలో పాఠకులతో మాట్లాడుతున్న కవిత

సరూర్‌నగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ వేటలో ఉన్న నిరుద్యోగులు, వివిధ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నిత్యం లైబ్రరీలకు వచ్చి రోజంతా కష్టపడి చదువుకుని వెళ్తుంటారని, అందుకు గాను ఉచితంగా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ కోసం యేటా విధిగా జాబ్ క్యాలండర్ విడుదల చేయాలన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను సైతం ముందుగానే తయారు చేసి ఇవ్వాలని సూచించారు. జనం బాటలో భాగంగా శుక్రవారం సాయత్రం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్‌లో గల జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, జాగృతి మీర్‌పేట్ ప్రతినిధి కోలా శ్రీనివాస్‌లతో కలిసి ఆమె సందర్శించారు. లైబ్రరీలో ఉన్న పాఠకులతో కాసేపు ముచ్చటించారు. లైబ్రరీలో ఎదురవుతున్న సమస్యలు, ఉద్యోగాల కోసం పడుతున్న తిప్పలను వారు తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అడ్డం పెట్టుకుని రెగ్యులర్ ఉద్యోగాలను(ఖాళీలను) భర్తీ చేయకుండా ప్రభుత్వం కావాలనే తాత్సారం చేస్తున్నదని ఆరోపించారు. గత ప్రభుత్వం తప్పులు చేసిందని ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండేళ్లయినా హామీలను అమలు చేయడం లేదన్నారు.



● 'జాగృతి జనంబాట'లో భాగంగా శుక్రవారం రాత్రి మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్ డంపింగ్ యార్డును తెలంగాణ జాగృతి సంస్థ అధినేత్రి కల్వకుంట్ల కవిత పరిశీలించారు. ఆమె వెంట దూగుంట్ల నరేష్ ప్రజాపతి, ఏలుకొండ రాంకోటి ప్రజాపతి తదితరులు ఉన్నారు.

- (మన్సూరాబాద్,ఆంధ్రజ్యోతి).

భక్తి శ్రద్ధలతో 'పోలి స్వర్గం'

● కొలనుల్లో కార్తీక దీపాలు వదిలిన మహిళలు



కొలనులో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు

సరూర్‌నగర్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి రోజు అయిన శుక్రవారం మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పోలి స్వర్గం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు తెల్లవారుజామే ఆలయాల్లో, ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరటి దొప్పలలో కార్తీక దీపాలు వెలిగించి నీటిలో వదిలారు.

● మీర్‌పేట్‌లోని శివసాయినగర్ కాలనీలో గల గౌరీ నీలకంఠేశ్వరస్వామి సమేత లక్ష్మీగణపతి ఆలయంలో పోలి స్వర్గం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తాత్కాలిక కొలను ఏర్పాటు చేయగా మహిళా భక్తులు అందులో కార్తీక దీపాలు వదిలారు. అనంతరం రుద్రాభిషేకం, గోపూజా కార్యక్రమాలు నిర్వహించారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో, డ్రైవర్ మృతి

హయత్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆటో డివైడర్‌ను ఢీకొనగా డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన హయత్‌నగర్ పీఎ్‌సపరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట లక్ష్మారెడ్డి పాలెంకు చెందిన నిమ్మల సింహాద్రి (49) ఓ ఆటో డ్రైవర్. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో సింహాద్రి హయత్‌నగర్ నుంచి ఆటోలో అంబర్‌పేట వైపునకు వస్తుండగా సంగం హోటల్ వద్ద ప్రమాదవశాత్తు ఆటో డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆటోలో నుంచి సింహాద్రి ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సింహాద్రి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఫోన్ చేయడంతో 108 సిబ్బంది అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారమందించారు. మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిరసనకు తరలిరండి : బీసీ హక్కుల సాధన సమితి

కొత్తపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ల వద్ద ఈ నెల 28న చేపట్టనున్న నిరసనను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణ కోరారు. శుక్రవారం న్యూ నాగోల్‌లోని ప్రజా సంఘాల కార్యాలయం ఎస్‌ఏ డాంగే భవన్‌లో సమితి ఎల్బీనగర్ నియోజకవర్గం సమావేశం సైదారావు అధ్యక్షతన జరిగింది. నిరసన కరపత్రాన్ని నాయకులు విడుదల చేశారు.

కార్పొరేటర్‌పై ఆరోపణలు తగవు : బీజేపీ

మన్సూరాబాద్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే ఆయన కీర్తి, ప్రతిష్టలను దెబ్బతీసేలా బీఆర్‌ఎస్ నాయకులు నిరాధార ఆరోపణ చేస్తున్నారని బీజేపీ డివిజన్ నాయకులు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల ఆరోపణలను ఖండిస్తూ మన్సూరాబాద్ బీజేపీ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో అభివృద్ధి పరుగులు పెడుతున్న తరుణంలో గత కొన్ని రోజులుగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మన్సూరాబాద్‌లోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో ఉద్దేశపూర్వకంగా గందరగోళం సృష్టిస్తున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు గుమ్మకొండ ముత్యంరెడ్డి, మునగాల హరీష్‌రెడ్డిలు విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న డివిజన్‌లో కార్పొరేటర్‌పై నిరాధారణ ఆరోపణలు చేస్తూ అల్లర్లు సృష్టించడమే కాకుండా ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారన్నారు.

సీపీఐ నేత దేవయ్య సేవలు మరువలేనివి

ఎల్బీనగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎల్బీనగర్ సర్కిల్ మాజీ కార్యదర్శిగా నాగిళ్ల దేవయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని సీపీఐ జాతీయ నాయకుడు సయ్యద్ అజీజ్ భాష పేర్కొన్నారు. సరూర్‌నగర్‌లోని శంకర్‌నగర్ కమ్యూనిటీ హాలులో సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ ఆధ్వర్యంలో నాగిళ్ల దేవయ్య సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి దేవయ్య పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. జిల్లాల కృష్ణ, గ్యార క్రాంతికుమార్, కమలమ్మ, సక్రునాయక్, వినోద్, మహమ్మద్ ఇస్మాయిల్, రమణమ్మ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్

కొత్తపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వాహనాల రాకపోకల నియంత్రణ కోసమే ట్రాఫిక్ రూల్స్ రూపొందించారని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి తెపారు. శుక్రవారం మేడిపల్లి జడ్‌పీహెచ్‌ఎస్ నుంచి మరో విడత 50 మంది విద్యార్థులు, ఇబ్రహీంపట్నం ప్రైవేటు స్కూల్ నుంచి 142 విద్యార్థులు ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. ఆర్‌ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఎస్‌ఐ నర్సింహారావు, ఏఎ్‌సఐ సోమ్‌నాథ్, హెచ్‌సీలు నర్సింగ్, ప్రదీప్ సిబ్బంది రమేష్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ నిబంధనల అవసరాన్ని వివరించారు.

● మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరమని టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి, ఎస్‌పీఓ అల్లూరయ్య వివరించారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 69 మంది మందు బాబులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు.

● ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు అందరికీ రూల్స్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి తెపారు. శుక్రవారం టీటీఐ ఆర్‌ఎస్‌ఐ సంతోష్‌కుమార్, ఎస్‌ఐ నర్సింహారావు బృందం రాచకొండ పరిధిలోని 9 ప్రాంతాల్లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై 572 మంది వాహనదారులకు, పౌరులకూ అవగాహన కల్పించారు.



అతిథులతో శ్రీగిరి తరుణి వెంకటమాధవరెడ్డి

'లగ్జరీ ఫ్యాషన్ ఫియస్టా' ప్రారంభం

మన్సూరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ పీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం సఖి బజార్ 'లగ్జరీ ఫ్యాషన్ ఫియస్టా' ప్రారంభించగా.. ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌ను నిర్వాహకురాలు శ్రీగిరి తరుణి వెంకటమాధవరెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పడాల శ్రీకాంత్, నూకల పద్మారెడ్డి, శిల్పారెడ్డిలు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఫ్యాషన్‌కు సంబంధించి ఉంచిన స్టాళ్లను 10వేల మంది సందర్శించి వస్తువులను కొనుగోలు చేసినట్లు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం కూడా భారీగా ప్రజలు సందర్శించనున్నట్లు పేర్కొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో షెడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మీశ్రీనివాస్

ఓల్డ్‌మలక్‌పేట నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని హైదరాబాద్ జాతీయ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. ఇటీవల మార్కెట్ అభివృద్ధికి రూ.45 లక్షలు విడుదల చేయగా దీంతో మరమ్మతు పనులను శుక్రవారం మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి చొరవతో మార్కెట్‌ను అన్ని విధాలా అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు లక్ష్మీశ్రీనివాస్ తెలిపారు. చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన ఏడాదిలో అనేక అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. మార్కెట్‌లో 40 ఏళ్ల క్రితం నిర్మించిన షెడ్లు శిథిలావస్థకు చేరాయని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయించి మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. మార్కెట్‌లో ఆన్‌లైన్ ధరలు రైతులకు సులువుగా తెలిసేలా పెద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది నియామకం, బీటీ పద్ధతిలో మరుగు దొడ్ల నిర్మాణం మొదలైన పనులు చేపట్టామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పంట అమ్ముకోవడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ కమిటీ కృషి చేస్తోందన్నారు. మార్కెట్‌లో పని చేసే కూలీలకు, కార్మికులకు గుర్తింపు కార్డులతో పాటు రెండు జతలు యూనిఫాంలు అందించామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి, కమిటీ సభ్యులు మహ్మద్ షకీల్, పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, బుడ్డా సత్యనారాయణ, మశ్రత్ సుల్తానా, పన్నాల రాజేందర్‌రెడ్డి, కిషన్‌సింగ్, జగదీష్, మార్కెట్ సిబ్బంది పవన్ తదితరులు పాల్గొన్నారు.